# సుడిగుండం....

రచన: ...
ఎస్. వసంత్ కుమార్.

అప్పీ—అది అతని హృదయాంతరాళంనుంచి ప్రేమతో వెలువడే పిలుపు.

అప్పడూ—అది ఆమె హృదయ కుహరంనుంచి నిండారిన ప్రేమతో పలికే పలుకు.

అప్పడు, అప్పిమామ. భార్యాభర్తలు. అనురాగ ప్రియులు. అప్పడు రోజల్లా చమటోడ్చి కష్టపడి పనిచేసి సాయంసంధ్యవేళ ఇంటికి చేరుకునేసరికి అప్పి ఆదరంతో, ఆప్యాయంతో అతనికి వేడినీళ్ళిచ్చి స్నానంచేసిన తర్వాత కాస్త అంబలి ఇచ్చేది. అదే ప్రేమతో స్వీకరించేవాడా కష్టజీవి. ఇద్దరూ ఆరుబయట పచ్చగడ్డిమీద కూర్చుని తీయని మృదు మధుర సంభాషణ సల్పుతుండేవారు. ప్రతిరోజూ మధ్యాహ్నం అప్పడికి భోజనం మిల్లుకి తీసుకుపోయేది. ఆ ఎండలో నడుచుటవలన కలిగిన శ్రమఫలితంగా ఏర్పడిన స్వేదబిందువు ముఖానికో వింత సౌందర్యాన్ని ఆపాదిస్తుంటే ఏ దేవకన్యో ఈమాదిరిగా వస్తున్నదనుకునేవారు మిగిలిన కార్మికులంతా. మిల్లుప్రక్క చెట్లనీడలో కూర్చుని ఆమె తెచ్చిన భోజనాన్ని ఆమె మృదుమధురమైనమాటలు వింటూ ఆరగించేవాడు. రోజులూ, వారాలూ నెలలు గడిచి పోతున్నై. వారి రసానుభూతికి అనుగుణ్యంగా, ఆ ప్రేమ దంపతుల ప్రణయ కలాపాల ఫలితంగా వారి ప్రేమఫలం పరిపక్వదశకు వచ్చింది. అప్పీ, అప్పడు ఇప్పుడు తల్లి తండ్రులు. వారి ప్రేమఫలితంగా ఉద్భవించిన చిట్టిని చూస్తూ వారు ఆనందంతో కాలం గడుపుతుండేవారు. కాలచక్రం కదలిపోతోంది. ఆపదలతోనైననూ, ఆనందముతోనైననూ కాలచక్రం కదలక మానదు కదా! కాలచక్రపు కదలికలు వారిలో మార్పును తెచ్చినై. వారి ఆనందజీవిత సాగరంలో తుపాను చెలరేగింది. అప్పడికి అకస్మాత్తుగా ఒకరోజు సాయంత్రం జ్వరం తగిలింది. రెండురోజులలోనే అది టైఫాయిడ్‌కింద మారింది. వారంరోజులయినా తగ్గుముఖం కనపడక నానాటికీ అధికమవుతూ ఉంది. ఇంట్లో ఆపూటకి నూకలు లేవు. డాక్టరుకి డబ్బు ఇవ్వాలంటే ఎలా తేవాలో అర్థంకాలేదు. చిట్టికి ఆముదానికి కూడా ఇంట్లో కానీ లేదు. మిల్లుయజమాని రామనాథంగార్ని అడిగి ఏమైనా కొంతడబ్బు తెస్తానని బయలుదేరింది అప్పి. రామనాథం స్వభావం పూర్తిగా ఎరిగిన అప్పడు వెళ్ళవద్దని వారించాడు. కాని పతిసేవాపరాయణయైన అప్పికి అతని మాటలు వినపడలేదు. రామనాథం తేనెపూసిన కత్తివంటివాడు. ఆ మిల్లులోని కూలీలనందరినీ తన ఆనందానికి బలిగొన్నాడు నలిమినీ, బలిమినీ కూడా. అతని బాహువుల్లో ఇమిడి నవ్వనిస్త్రీ ఆమిల్లులో లేదు. ఎన్నాళ్ళనుంచో అప్పిని అనుభవించాలని తగిన సమయంకోసం వేచియున్నాడు. ఆ సమయం ఈనాడు అనుకోకుండా లభించింది. అతనిలోని కోరికలన్నీ ఒక్కుమ్మడిగా తలెత్తినై. "రా అప్పీ! ఇలా వచ్చేవేం ఇవాళ? అప్పడి వంట్లో ఎలా ఉంది?" అని ఎంతో అభిమానస్తుడివలె అడిగాడు.

'ఏం చెప్పను దొరా, ఆడికి ఇయాళ మరీ ఇదిగా ఉంది. ఇంట్లో నూకలు లేవు. మందుకి డబ్బులేదు. మిమ్మేదైనా అడిగితీసుకువెళ్దామని వచ్చాను దొరా. వాడికి కాస్త కులాసాగా ఉంటే మీడబ్బు తీరుస్తాడులెండి బాబూ' అంది అప్పి ఎంతో జాలిగా.

'సరేలే చూస్తాను రేపు పొద్దున రా' అన్నాడు.

'అలాగంటే ఎలాగ దొరా. ఇంట్లో నూకలు కూడా లేవు' అంది అప్పి బ్రతిమాలుకుంటూ.

'సరే లోపలికి రా, బియ్యం కొలుస్తాను తీసుకుపో' అంటూ లోపలికి సాగిపోయాడు రామనాథం. అతని వెనుకనే బయలుదేరింది అప్పికూడా. రామనాథం వెనక్కి తిరిగి

యువదంపతులకు వెలువడినది 50 గ్రంథముల
శృంగార మార్గము త్వరపడుడు సారాంశము

**సతీపతికుతూహల రహస్యములు.**

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి రసాస్వాదనము చేయుటయే గాక కామశాస్త్రమును తప్పక పఠించేవారు. రాణివాస మందలి కాంతలుకూడా దీనిని నేర్పెడివారని వాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడీ కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారి యపరాధము కాదు. తగిన గ్రంథము లేక పోవుటే దీనికి ప్రధానకారణము. నేడీ కొరతతీరినది. సతీపతి కుతూహల రహస్యములను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామకళా గ్రంథములతో నిండి కళాసంబంధమగు పూర్ణ జ్ఞానమును కలిగించుచున్నది. ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది. గ్రంథము వెల రూ. 2—8—0. పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,
సౌకార్‌పేట. మద్రాసు.

అప్పి చెయ్యిపట్టుకున్నాడు. 'ఏంది దొరా?' అంది అప్పి. రామనాథం ఆమెవంక ఆశతో చూచాడు. అతని ఆకలి గొన్న చూపులు అతని దాహాన్ని వ్యక్తపరుస్తున్నాయి. అప్పి భయ విహ్వలయైపోయింది. ఆమె శరీరమంతా వణుకు తోంది. అతను ఆమెను దగ్గరకు లాక్కుంటున్నాడు. 'నీకు పుణ్యముంటుంది వదులు దొరా' అంది బ్రతిమాలుతూ. కాని ఆ కామాంధుడికి ఆ అబలమాటలు చెవిటివాడి ముందు శంఖము ఊదినట్లయింది. అప్పి తనశక్తినంతా ఉపయోగించి పెనుగులాడింది. 'అనవసరంగా గలాటా చేశావా నీకు డబ్బు దొరకదు, బియ్యం దొరకవు. ఆతర్వాత ఏం అనుకున్నా లాభం లేదు' అన్న రామనాథం మాటలతో ఆమె అశక్తయై లొంగిపోయింది గత్యంతరంలేక. అతని పశువాంఛకు ఆమె బలిఅయిపోయింది. ఆమె శరీరం అతని చేతులలో వొంపులు తిరిగిపోయింది. అతని వాంఛ తీరింది. ఆ పశువు నవ్వుతూ వెళ్ళిపోయాడు ఆమె చేతిలో రెండు పదుల నోట్లుపెడుతూ. అలాగే కొయ్యబారిపోయింది. అప్పికి ఇంటిదగ్గరి భర్తజ్ఞాపకంరాగానే బయలుదేరింది బియ్యంతో డబ్బుతో. మూర్ఖుడు తన శరీరాన్ని మలినంచేశాడే అనే కోపం, అవమానం వేధించుతున్నా, పూజ్యుడైన తన భర్త కోసం, తన చిన్నారిచిట్టికోసం, డబ్బు, బియ్యం దొరికినయి గదా అనే సంతోషం ఏమూలో తొంగిచూస్తోంది హృద యాంతరాళంలో. చెదరినజుట్టు నలిగినచీరె చెమటపట్టిన ముఖం, చేతిలో వస్తువులు, ఆవాలకం అంతా చూడగానే జరిగిన సంఘటన అంతా ఊహించుకున్నాడు అప్పుడు.

'అప్పీ ఏమిటిదంతా' అన్నాడు నైరాశ్యంతో.

'ఏం లేదు మామా బియ్యం' అంది.

'ఇన్నిబియ్యం ఎట్లా వచ్చినై'? అన్నాడు కొంచెం కటువుగా. అప్పి మాట్లాడలేకపోయింది. 'అప్పీ' అని మరీ గట్టిగా అన్నాడు ఇంకోసారి. ఆమెకేమీ తోచలేదు ఏం చెప్పాలో? నిన్నే అప్పీ' ఇంకొంచెం గట్టిగా కేకవేశాడు. అంతే అతని. 'ప్రాణవాయువులు అ స ం త వా యు వు ల్లో లీనమయినై మామా' అంటూ అతని విగతశరీరంమీద వాలిపోయింది. 'అప్పి. ఏమిటో తెలియని చిట్టిగాడు 'కెవ్వు' మన్నాడు ప్రపంచమంతా అంధకారమయమయింది అప్పికి. ఎవరి కోసమయితే ఆమె తన మానాన్నికూడా లెక్కచేయలేదో అవ్యక్తి ఆమెకి దూరమైపోయాడు. ఆకాశమంతా భయంకరంగా నల్లగా ఉంది. ఆఅంధకారంలోకి అలాగేకూర్చుండి పోయింది అప్పి. దూరంగా బియ్యం, రెండు పదుల కాగితాలు నవ్వుతున్నాయి ఆమెని ఎగతాళి చేస్తున్నట్లుగా.

# దీపావళినాడు....

రచన: యర్రగుంట్ల సూర్యనారాయణమూర్తి.

●

ఆనాడు దీపావళి-అనొచ్చు దివాలి; అంటే ఆనాడు దివాలా తీసిన, దివాలాతీయని పెద్దలు, పెద్దబొజ్జలు కొత్త ఖాతాలు వేసినరోజు. ఆరోజు లక్ష్మికి మిఠాయిపెట్టి రోజూ తమకి మిఠాయి పెట్టమని ప్రార్థించే రంగుపాగాలవారి రోజు. లుబ్ధులు, పారబ్ధులు, వ్యర్థులు వ్యాగోషించేరోజు. యౌవనమైకంలో, మైకంలోని మాధుర్యంలో స్వప్నాలు కలిగేరోజు.

ఆనాడు దీపావళి — దీపాలనుండి తికమకలు పడి చంచలంగా బయటవెడలుతున్నాయి ధూమశకలాలు. శకుని పక్షంవారు అంధకారమత్తున జొచ్చి అవులిస్తున్నారు. గజ్జ కట్టిన ఖజానానాట్యం, పాటనేర్చిన పడతిదాస్యం అన్వయించిపోయేయి శృంగారాన్వేషణలో. రాగం, అనురాగం, రోగం పటాషుప్రేలుడు ధ్వనిలో ఆరోహించిపోయేయి. తుంటరుల ముఖాలు చిట్లిపోయేయి—గడుసరులచేతులు మంటలెక్కేయి—పెండ్లికున్న అమ్మాయిలజాలిలో మూలనున్న సినిసిజమ్ పొగలు గక్కింది.

దీపావళి అమావాస్య ... తెలుపు నలుపు ... దివ్యమైన, వ్యంగ్యమైనచిత్రం. అతులితానందంలో అనారోగ్యం-మంచిపాట మధ్యన గ్రామఫోనుకీ అయిపోయినట్లు. అదే చిత్రం. మరి ఖద్దరుని ఎర్రపట్టా వస్త్రాపహరణం చేస్తున్న రోజులు కావూ! సత్యాన్వేషణంలోకూడ అసత్యనాయకత్వం. ఏమైన సీతాస్వయంవరం రోజులు కావు, రావణాసురుని స్వయంవరదినాలివి. ఇట్లాంటిదినాల్లోని దీపావళి ఎంతమంది మహానుభావులు జన్మించిరో, దీపావళిలో—మంచి జన్మదినం - అది అమావాస్యకూడ. అంధకారంలో ఆకారాలుద్భవించొచ్చు. అంటే గింటే చేప్పేదేమంటే దీపావళి మంచిరోజు—చాలమంది మంచిదనుకునేరోజు గాని......

ఆనాడుకూడ పెంటకుప్పలమీది ఆకుల కంటుకున్న మెతుకులకు, కూరముక్కలకు ఆశతో చూస్తున్నాయి కొన్ని కండ్లు. దీపాలశోభ ఆక్షణంలో ఆకళ్లల్లో మెరయొచ్చు—స్మశానవాటికలో శవదహనకాంతిలో గుడ్లగూబకళ్ళుమెరసినట్లు, ఇనప్పెట్టి ముందున్న గుడ్డిదీపపు వెలుగులో లోభిచేతిలోని బంగారం పచ్చగా నవ్వినట్లు. తీపదనంలేక చప్పగా 'ఛా' త్రాగుతుంటే, మార్వాడీపిల్ల ఎదురింటికిటికీలో కూర్చుని జిలాబీతింటూ వెకిలిగా నవ్వుతూంది. తందా